## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

❖ ఉపరాష్ట్రపతి అభ్యర్థి నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు ఢిల్లీకి వెళ్లనున్నారు.

❖ శాంతిభద్రతల పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే రెండవ స్థానంలో ఉందని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.

❖ రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ రేపు ఢిల్లీలో పర్యటించి పలువురు కేంద్రమంత్రులతో సమావేశం కానున్నారు.

❖ వాయువ్య బంగాళాఖాతంలో ఈరోజు ఉదయం మరో అల్పపీడనం ఏర్పడిందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================

ఉపరాష్ట్రపతి అభ్యర్థి నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు ఢిల్లీ వెళ్లనున్నారు. ఈ నెల 21న ఎన్డీయే కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆ కార్యక్రమానికి ఒక రోజు ముందుగానే అనగా 20వ తేదీన ఎన్డీయే పార్లమెంటరీ బోర్డు సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ఎన్డీయే కూటమి ముఖ్య నాయకులు ఉపరాష్ట్రపతి అభ్యర్థిని ఖరారు చేయనున్నారు.

=====================

శాంతిభద్రతల పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే రెండవ స్థానంలో ఉందని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి ఈరోజు డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో హోంమంత్రి మాట్లాడుతూ... ఎన్డియే కూటమి ప్రభుత్వంలో పోలీసులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. నెల రోజుల్లో పోలీసులకు కొత్త వాహనాలను అందిస్తామని, రాష్ట్రంలో అధిక సంఖ్యలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మహిళల భద్రతకు భరోసా కల్పిస్తున్నామని ఆ దిశగా పోలీస్ డిపార్ట్ మెంట్ లో కూడా వాట్సాప్ గవర్నెన్స్ తీసుకువచ్చామని హోంమంత్రి అనిత వివరిస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

=====================

రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ రేపు ఢిల్లీలో పర్యటించనున్నారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులపై సంబంధిత కేంద్ర మంత్రులతో చర్చించేందుకు ఈరోజు రాత్రి ఢిల్లీకి బయలదేరనున్నారు. రేపటి పర్యటనలో రాష్ట్రానికి ఇటీవల సెమీకండక్టర్స్ తయారీ పరిశ్రమను మంజూరు చేసినందుకుగానూ కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి అశ్విని వైష్టవ్ ను కలిసి మంత్రి లోకేష్ కృతజ్ఞతలు తెలియజేయనున్నారు. అదే విధంగా కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, హర్దీప్ సింగ్ పూరి, శరబానంద్ సోనోవాల్, పీయూష్ గోయల్, జైశంకర్ లతో కూడా సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున వివిధ ప్రతిపాదనలను కేంద్ర మంత్రులకు మంత్రి లోకేష్ అందజేయనున్నారు.

=====================

యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా అణిచివేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ కోరారు. విజయవాడలో ఆయన ఈరోజు ఆకాశవాణితో మాట్లాడుతూ... గంజాయి కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం దృష్టి సారించిందని, ఆ దిశగా ఈగల్ పేరిట ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేసిందన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల సామాజిక, మానసిక, శారీరక అనారోగ్యాలు తలెత్తుతాయని, అందుకే దేశభవిష్యత్తు దృష్ట్యా మాదకద్రవ్యాలను కలిసికట్టుగా అరికడదామన్నారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా మాదక ద్రవ్యాల రవాణాపై పటిష్టమైన నిఘా ఉంచామని.. అదేవిధంగా మాదక ద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ వెల్లడిస్తూ..

(వాయిస్ 33 సెకన్లు)

విరామం

=====================

దేశానికి వ్యతిరేకంగా నిషేధిత ఉగ్రవాద సంస్థలతో పలు వాట్సాప్ గ్రూపుల్లో సంబంధాలు కలిగి ఉన్న ఓ వ్యక్తిని శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పోలీసులు అరెస్టు చేశారు. పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ రత్న ఈరోజు పాత్రికేయులకు వెల్లడిస్తూ... ధర్మవరం పట్టణంలో బిర్యానీ వంటకాల తయారీదారుడుగా జీవనం సాగిస్తున్న నూర్ మహమ్మద్ అనే వ్యక్తి జైషే మహమ్మద్, సదాయి జిహాదీ, మగ్బూజి కి ఆవాజ్, నజ్రియాతి వంటి సంస్థలకు సంబంధించిన 36 వాట్సాప్ గ్రూపుల్లో సభ్యునిగా ఉంటూ కీలకంగా వ్యవహరిస్తున్నాడని గుర్తించడంతో అరెస్ట్ చేశామని చెప్పారు. మరిన్ని వివరాలను ఎస్పీ తెలియజేస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

=====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈ నెల 29వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

=====================

వాయువ్య బంగాళాఖాతంలో బుధవారం ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్టంలో అనేక చోట్ల విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఓ వైపు ఈ వర్షాలు కొనసాగుతుండగా వాయువ్య బంగాళాఖాతానికి ఆనుకుని ఉన్న ఉత్తర కోస్తాంధ్ర,

దక్షిణ ఒడిశా తీరాల వద్ద ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈరోజు ఉదయం 8 గంటల 30 నిమిషాలకు అదే ప్రాంతంలో మరో అల్పపీడన ప్రాంతం ఏర్పడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ వివరాలను వాతావరణ శాఖా అధికారి ఎల్.నారాయణ వెల్లడిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

ఇక ఈ అల్పపీడనాల ప్రభావంతో రేపు విశాఖపట్టణం, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అతి భారీ వర్షాలు... శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, గుంటూరు, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖలోని తుఫాను హెచ్చరికల కేంద్రం తెలిపింది.

=====================

భారత వాతావరణ శాఖ (ఐఎండి) సమాచారం మేరకు రాష్ట్రంలో భారీ వర్షాలతో పాటూ ఈదురుగాలులు వీచే అవకాశం ఉండటంతో మంగళవారం వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళరాదని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల వద్ద ఉండరాదని హెచ్చరించారు. అప్రమత్తంగా ఉండాలని లోతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

=====================

=====================